మార్కెట్ యార్డు కార్యదర్శికి సమ్మె నోటీసు అందజేస్తున్న సిఐటియు నాయకులు రాముడు, సాయిబాబ, తదితరులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- మార్కెట్ యార్డు కార్యదర్శికి సిఐటియు సమ్మె నోటీసు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, రైతులు పండించి న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలి కార్మిక సంఘాలన్నీ పాల్గొంటున్నాయని సమ్మె నోటీసును మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ ఆర్. జయలక్ష్మి సిఐటియు నాయకులు ఇచ్చారు. సమ్మెనోటీసు ఇచ్చిన వారిలో సిఐటియు మార్కెట్ యార్డ్ యూని యన్ గౌరవాధ్యక్షులు టి.రాముడు. సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయి బాబా,మార్కెట్ యార్డు యూనియన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, యూని యన్ల కార్యదర్శులు నాగరాజు, మనోహర్, వెంకట స్వామి, మద్దిలేటి, చిన్నబడేసా, నారాయణమ్మ, మహిళా హమాలీలు ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధంగా యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చేం దుకు రంగం సిద్ధం చేసిందన్నారు. అందుకు నిరసనగా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కార్మిక సంఘా లు ఈ లేబర్ కోడ్‌లను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తు న్నాయన్నారు. మొండిగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై దేశవ్యాప్తంగా సమ్మె సైరన్ మోగింద న్నారు. దీనితోపాటు రైతులు ,ప్రజలు పడుతున్న అనేక సమస్యల పరిష్కారం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని వ్యతిరేకిస్తూ ఈనెల 20న సమ్మె చేయబోతున్నామన్నారు. ఈ సమ్మెలో మార్కెట్ యార్డ్‌లోని అన్ని యూనియన్లలో ఉండే కార్మికులు పాల్గొంటున్నారని తెలిపారు. సమ్మెను జయప్రదం చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, ఆటో, భవన నిర్మాణ కార్మి కులు, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గేటు ఒకటి..
సమస్యలు అనేకం...

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఒకే గేటు ద్వారా రాకపోకలు సాగించడం అనేది తీవ్రమైన సమస్యగా మారింది. ఇది రోగుల ప్రాణాలకు ముప్పు కలిగించే అవకాశం ఉంది. అధికారులు తక్షణమే స్పందించి, ప్రజల విజ్ఞప్తిని మన్నించి, అదనపు గేట్లను ఏర్పాటు చేయడం లేదా మూసివేసిన గేటును తిరిగి తెరవడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. రాజకీయపరమైన కారణాలు లేదా వ్యక్తిగత ప్రాధాన్యతలకు అతీతంగా, రోగుల సౌకర్యం, భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ఈనేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

-అవుట్, ఇన్ గేట్లను ఏర్పాటు చేయాలి -జిజిహెచ్ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించాలి

తీవ్రమైన ట్రాఫిక్ సమస్య: ఒకే గేటు ఉండటం వల్ల ఆసుపత్రి వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇది అంబులెన్స్‌ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది.

మూసివేసిన ప్రవేశ ద్వారం: ఆసుపత్రికి మరో ప్రవేశ ద్వారం ఉన్నప్పటికీ అది గత ఎనిమిది సంవత్సరాలుగా మూసివేయబడి ఉంది. దీనికి గల కారణాలు స్పష్టంగా లేవు.

గేట్ల మార్పిడిపై విమర్శలు: గతంలో ఉన్న గేట్లను మార్చడం, కొత్త గేట్లను ఏర్పాటు చేయడం వెనుక రాజకీయపరమైన కారణాలు లేదా అధికారుల వ్యక్తిగత ప్రాధాన్యతలు (ట్రేడ్ మార్క్) ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి: కంటి ఆసుపత్రి వద్ద ఉన్న గేటును ఎగ్జిట్ గేటుగా మార్చడంతో, గుత్తి వైపు నుండి వచ్చే అంబులెన్సులు , రోగుల వాహనాలు లోపలికి ప్రవేశించడానికి చాలా దూరం చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. ఇది అత్యవసర పరిస్థితుల్లో సమయం వథాకు దారితీస్తోంది.

సెక్యూరిటీ సిబ్బంది ఆంక్షలు: అధికారులు అనుమతిస్తున్నప్పటికీ, సెక్యూరిటీ సిబ్బంది రోగుల వాహనాలను ఎగ్జిట్ గేటు నుండి లోపలికి అనుమతించడం లేదు.

అంతర్గత రాకపోకల్లో ఇబ్బందులు: ఒక వార్డు నుండి మరో వార్డుకు వెళ్లడానికి కూడా రోగులు , వారి సహాయకులు చుట్టూ తిరిగి వెళ్లవలసి వస్తోంది. ఇది రోగులకు మరింత అసౌకర్యాన్ని కలిగిస్తోంది.

ప్రజల డిమాండ్: ప్రజలు, వివిధ సంఘాల నాయకులు ఆసుపత్రికి ప్రత్యేకంగా అవుట్, ఇన్ గేట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గి, రోగులకు సకాలంలో వైద్యం అందుతుందని వారు ఆశిస్తున్నారు.

అవుట్ ఇన్ గేట్లు ఏర్పాటు చేయాలి

- వెంకటేశ్వర్లు లక్ష్మీ నగర్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే వైద్యులు, వైద్య సిబ్బంది, రోగులు, రోగుల బంధువులు అంబులెన్స్ వాహనాలు ఒకేగేటులో రాకపోకలు సాగించడం వల్ల ట్రాఫిక్ నిలిచిపోతుంది. ట్రాఫిక్ నిలిచిపోయినప్పుడు అంబులెన్సులో వచ్చే ఎమర్జెన్సీ రోగులకు స్థితి ఏర్పడి గాలిలో ప్రాణాలు కలిసిపోతున్నాయి. ఆసుపత్రి బయట నుండి వచ్చే అంబులెన్సులు కూడా 50 నుంచి 100 మీటర్ల దూరాన్ని 20 నిమిషాలు పైగా సమయం తీసుకుని చుట్టూ తిరుగుతూ క్యాజువాలిటీ వద్దకు రావాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరిస్థితిని ఆసుపత్రి ఉన్నతాధికారులు వెంటనే చక్కబెట్టాలి.

ఆస్పత్రి గేటు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

- సింధు సుబ్రహ్మణ్యం, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ ఐఎఎస్ అధికారి

ఆసుపత్రికి ఉన్న ప్రధాన గేటు లోనే వైద్యులు, వైద్య సిబ్బంది, రోగులు, రోగుల బంధువులు, అంబులెన్సులు తదితర వాహనాలు రాకపోకలు సాగుతూ ఉండటం వాస్తవం. ఈ గేటు వద్ద సమస్య ఏర్పడుతుందని కొందరు తన దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు సూచన చేస్తాను.

రోగుల ప్రాణాలను కాపాడాలి

- విజయ రామాంజనేయులు, సిఐటియు నాయకులు

ఉదయం సాయంత్రం సమయంలో జిజిహెచ్ ప్రధాన గేటు వద్ద అధికంగా రద్దీ ఉంటుంది. అన్ని రకాల వాహనాలు, పాదచారులు ఒకే గేటు ద్వారా రాకపోకలు సాగిస్తుండటం వల్ల ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఆ సమయంలో అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులు, రోగుల బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రికి అవుట్ ఇవ్ గేట్లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకల రద్దీని తగ్గించి రోగుల ప్రాణాలను కాపాడాలి. ఇందుకోసం మూసి ఉంచిన గేటును తెరిచి ప్రజలకు సౌకర్యం కల్పించాలి

సమన్వయంతో పని చేయాలి

- ఇన్‌ఛార్జి కలెక్టర్ డాక్టర్ నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ డాక్టర్ బి.నవ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన వస్తువులు, రేషన్, మందులు, నూనె (ఇంధనం) తదితర నిత్యావసర వస్తువులను ప్రజలకు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో అనవసరమైన పుకార్లు, ట్రోల్‌లను వ్యాపింప చేయకూడదని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు అనవసరమైన భయాందోళనలకు గురి కావొద్దు అని కలెక్టర్ పేర్కొన్నారు.

12న కలెక్టరేట్లో గ్రీవెన్స్

ఈనెల 12న సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.నవ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదల సరుకుల కోత..!

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో 1,228 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 6,76,209 రేషన్ కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచధార పంపిణీ చేయాల్సి ఉంది. నాలుగు నెలలుగా కందిపప్పు కేటాయించడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు కర్నూలు జిల్లాకు 676.209 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 541.804 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంది. జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఫిబ్రవరి నెలలో 30 శాతం కార్డులకు బఫర్ స్టాక్ నుంచి పంపిణీ చేశారు. మార్చి నెలలో అసలు ఎలాంటి కేటాయింపులూ చేయలేదు. ఏప్రిల్ నెలలోనూ అదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఒక్క లబ్ధిదారునికి కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు పూర్తిగా నిలిపివేయడంతో పేదలు పప్పు చారుకు కూడా దూరమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన సరుకులను ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. గతంలో టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇచ్చారు. ప్రతినెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేశారు. పండగ తోఫాలకు ఫుల్‌స్టాఫ్ పెట్టారు. ఈ ఏడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. కనీసం కందిపప్పు కూడా సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశే మిగిలింది. ఉగాది, రంజాన్ పండగలకు ప్రభుత్వం అన్ని రేషన్ సరుకులను ఇస్తుందని లబ్ధిదారులు ఆశించినా నిరాశే ఎదురైంది.

విద్యార్థులకు గాలం

నిబంధనల ప్రకారం గతంలో పదో తరగతి ఫలితాల అనంతరం అడ్మిషన్ల కోసం కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు తమ సిబ్బందికి లక్ష్యాలు విధించి అడ్మిషన్లు సేకరిస్తుంటాయి. ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. అడ్మిషన్ రిజర్వ్ చేసుకుంటే రాయితీలిస్తామని ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాల లు చెబుతున్నాయి. వివిధ కోర్సులను ప్యాకేజీగా రూపొందించి 20 నుంచి 40 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి అడ్మిషన్లు సేకరిస్తున్నాయి. రెండేళ్లుగా జూనియర్ ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు తలకిందులైన నేపథ్యంలో ఆర్థిక పరిపుష్టత లేకపోయినా పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా మంచి కళాశాలలో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులు యోచిస్తున్నారు. దీనిని క్యాష్ చేసుకునేందుకు కార్పొరేట్, ప్రయివేట్ కళాశాలల నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. విద్యార్థులను ఎలాగైనా తమ కళాశాలలో చేర్చుకునేందుకు ఇంటింటా ఫోన్, ఎస్ఎంఎస్ ద్వారా అప్పుడే ప్రచారం మొదలు పెట్టారు. బుట్టలో వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ కళాశాలలో ఉత్తమ బోధనతో పాటు ఫలానా ప్రత్యేకతలు ఉన్నాయని, చేరితే రాయితీలు ఇస్తామని ఊదరగొట్టేస్తున్నారు. విద్యార్థుల చిరునామా, ఫోన్ నెంబర్లను ప్రయివేట్ సంస్థల ప్రతినిధులు, ఆయా పాఠశాలల నుంచి ఇప్పటికే సేకరించారు. ఆ విద్యార్థి మార్కులు, కుటుంబ ఆర్థిక స్థోమతను తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రయివేట్ విద్యాసంస్థల ప్రతినిధులు స్థానికంగా నియమించుకున్న మధ్యవర్తుల ద్వారా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్తున్నారు. తమ కళాశాలలో చేర్పితే ఫీజు రాయితీ ఇస్తామని, సౌకర్యాలు కల్పిస్తామని, పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని, ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని ఊదరగొడుతున్నారు.

అంగన్వాడీలకు కష్టాలు

అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గతంలో భారీ సమ్మె సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలు హామీలను కురిపించింది. గత వైసిపి ప్రభుత్వం హామీ ఇచ్చినా ఒక్క హామీని కూడా అమలు చేసిన పాపాన పోలేదు. ఎన్నికల ప్రచార సమయంలోనూ కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు పలు హామీలను ఇచ్చింది. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా నేటికీ వారికి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పాటు యాప్‌ల భారం పెరిగింది. ఇప్పటికీ వారు క్షేత్రస్థాయిలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సెంటరు చిన్నారులు ఆలస్యంగా వస్తే వారికి అన్నం కూడా పెట్టలేకపోతున్నామని వాపోతున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల నుంచి పకడ్బందీగా ప్రభుత్వం మెనూ అందించే ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలి యాప్‌లలో అప్‌లోడ్ చేయాలి. కొంతమందికి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ కాక అవస్థలు పడుతున్నారు. ఈ యాప్‌ల నిర్వహణలో సక్రమంగా లేని, వివరాలు అప్‌లోడ్ కాని టీచర్లపై ఒత్తిడి చేస్తున్నట్లు అంగన్వాడీలు వాపోతున్నారు.

పోస్టర్లు అంటిస్తున్న అబ్దుల్ దేశాయ్, తదితరులు

మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు

-పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

10వ వార్డ్ కడక్‌పుర సిపిఎం పార్టీ నాయకులు కమిటీ సభ్యులు ఇంటింటి తిరిగి మా ఇంటికి స్మార్ట్ మీటరు వద్దు.. కరెంట్ ఛార్జీలు తగ్గించాలని ప్రతి కరెంట్ మీటర్ దగ్గర సిపిఎం ఆధ్వర్యంలో స్టిక్కర్లు వేశారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్, వార్డు నాయకులు చాంద్ బాష ,మహమ్మద్ హుస్సేన్‌లు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని ఎన్నికల హామీలు ఇచ్చారన్నారు. నారా లోకేష్ ఒక అడుగు ముందుకు పోయి స్మార్ట్ మీటర్ను రోడ్డు మీద పగలగొట్టారన్నారు. నేడు అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికలు గెలిచాక మరొక మాట మాట్లాడుతుందన్నారు. ఇప్పటికే ప్రజల మీద భారాలు అధిక ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. కరెంట్ చార్జీలు వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను సామాన్య ప్రజల ఇండ్ల దగ్గర పెట్టకూడదన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రజలను చైతన్యం చేసి పెద్ద ఎత్తున కలెక్టర్ ఆఫీస్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మన్నెం, దావీద్, అన్వర్‌బాష, సలీం తదితరులు పాల్గొన్నారు.

అల్వాల , సి బెళగల్ బీటి రోడ్డు పూర్తి

కొత్త శోభ సంతరించుకొని ఆకర్షిస్తున్న రోడ్డు ఆయా గ్రామాల ప్రజలు హర్షం

ప్రజాశక్తి-సి బెళగల్

ఏళ్లుగా అల్వాల – సి బెళగల్ గ్రామాలకు రోడ్డు సమస్య మరుగున పడింది. అలాంటిది గత ప్రభుత్వం సిబెళగల్ కేంద్రానికి గోనెగండ్ల మండలంలోని గోనెగండ్ల నుండి చిన్న మర్రివీడు, కులూమల, అల్వాల గ్రామాలకు రోడ్డు అనుసంధానం చేస్తూ ఈ ప్రభుత్వం ఇటీవల పనులను పూర్తి చేయించింది. అల్వాల – సి బెళగల్ వరకు ఏడు కిలోమీటర్లు వుంది. అయితే సి బెళగల్ నుండి గొల్లల దొడ్డికి ఏడు కిలోమీటర్లు వుంది. ఈ రోడ్డు మధ్యలో మూడున్నర కిలోమీటర్ల వద్ద అల్వాల రోడ్డును కలుపుతూ కొత్తగా ముడున్నర కిలోమీటర్లు ఈ బీటి రోడ్డును వేశారు. దీంతో ఆ గ్రామాలకు సిబెళగల్ కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, రోడ్డు కొత్త శోభను సంతరించుకోవడంతో పలువురిని హర్షం వ్యక్తం చేశారు. వాహనాల రాకపోకలు, ప్రజల అవసరాలు తీర్చుకొనుటకు ప్రజల ప్రయాణాలు అధికమయ్యాయి.

లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాటం

-20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
-ఉద్యోగ, కార్మిక సంఘాల సదస్సులో వక్తలు పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

దేశంలో 10 కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు తలపెట్టిన ఈనెల 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని శనివారం కర్నూలు జిల్లా పరిషత్‌లోని ఎంపిపి హాల్లో ఎఐటియుసి నగర కార్యదర్శి జి చంద్రశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన ఉద్యోగ కార్మిక సంఘాల సదస్సును నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, ఎఐబిఇఎ రాష్ట్ర నాయకులు ఎం. నాగరాజు , బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామరాజు, ఎలక్ట్రిసిటీ 1104 తిరుమలయ్య , ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు భాస్కర్, ఎఐయుటియుసి జిల్లా కార్యదర్శి ఎం. నాగన్న, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శిలు ఏ. ఈశ్వర్, ప్రభాకర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుల్లగం మద్దిలేటి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ఎం. నల్లన్న మాట్లాడారు. వారి ప్రసంగాల్లోని ముఖ్యాంశాలు:

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్పొరేట్ల కోసం కార్మిక వర్గ హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని వక్తలు విమర్శించారు. ఈ కోడ్‌లు యజమానులకు కార్మికులను బానిసలుగా మారుస్తాయని, సమ్మె హక్కును , యూనియన్ ఏర్పాటును ప్రశ్నార్థకం చేస్తాయని వారు విమర్శించారు. ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేసేంతవరకు పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఉద్యోగులు , కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని దానిని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్, బొగ్గు గనులు, విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో 100శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం దేశ సమైక్యతకు , సమగ్రతకు భంగం కలిగిస్తుందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను కొల్లగొట్టే ఈ ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని వారు డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ సంస్కరణల పేరుతో దేశ సంపదను ఆదాని , అంబానీలకు ఊడిగం చేసేందుకు ప్రైవేటీకరణ చేస్తున్నారని వారు విమర్శించారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు , డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరల కారణంగా కార్మికులు , ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతన చట్టం కింద కాంట్రాక్ట్ , అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ. 26,000 వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. దేశ ఆదాయంలో 60శాతం అసంఘటిత రంగ కార్మికుల ద్వారా వస్తున్నప్పటికీ, వారికి సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. నూతన రోడ్డు రవాణా చట్టం ద్వారా కార్మికులు జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, అన్ని రకాల ఫైన్ల చలానాలను వేలకు వేలకు పెంచి ఆటో కార్మికుల నడ్డి విరుస్తున్నారని ఆటో కార్మిక సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో రంగ కార్మికులకు సంక్షేమ భద్రతా చట్టం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రంలో 8వ పిఆర్సి, రాష్ట్రంలో 12వ పిఆర్సి అమలు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపిలో భవన నిర్మాణ సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని , రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకున్న రూ.వందల కోట్ల ను తిరిగి చెల్లించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడి.అంజిబాబు

క్రీడాకారులు దేశరక్షణలో పాల్గొనే అవకాశం

75 మందికి క్రీడా దుస్తులు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ఉషు మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేస్తే త్రివిధ దళాలకు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఎంపికయ్యే అవకాశం ఉంటుందని, ఇది దేశ రక్షణలో పాలుపంచుకోవడానికి ఒక గొప్ప మార్గమని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ సూచించారు. ఈనెల 13, 14వ తేదీల్లో నగరంలోని బి క్యాంపులోని టీజీ లక్ష్మీ వెంకటేష్ కళ్యాణమండపంలో జరగనున్న రాష్ట్ర, జిల్లా స్థాయి ఉషు, మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు తన సొంత ఖర్చులతో 75 మందికి ఆయన శనివారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. జిల్లా ఉషు మార్షల్ ఆర్ట్స్ క్రీడ సంఘం కార్యదర్శి టి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ ఒలంపిక్ క్రీడల్లో ఒకటైన ఉషులో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని, ఇది యువతకు మంచి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఉషు కేవలం ఆత్మరక్షణకు మాత్రమే కాకుండా సమాజ రక్షణకు కూడా ఉపయోగ పడుతుందన్నారు. ఇది విద్యార్థుల్లో పోరాట పటిమను పెంచుతుందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో యువత కొంతకాలమైనా రక్షణ రంగంలో సేవలు అందించాలనే నిబంధన ఉందని గుర్తు చేశారు. దేశ సమగ్రత , రక్షణ కోసం యువత ఈ రంగంలోకి రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆరోగ్యం మెరుగు పడు తుందన్నారు. ఉషులో ప్రాణా యామం, మెడిటేషన్, యోగ వంటి ఆరో గ్యానికి ఉపయోగపడే అంశాలు ఉంటాయన్నారు. పరిశుభ్రమైన నీరు తాగాలని, కలుషి తమైన నీటికి దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలను ప్రోత్సహించ డానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

క్రీడాకారులను అభినందిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

క్రీడాకారులకు ఎమ్మెల్యే దస్తగిరి అభినందన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మొదటి ఫెడరేషన్ నేషనల్ ఛాంపియషిప్ 2024-25, డివిజనల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, నాసిక్, మహారాష్ట్రలో ఏప్రిల్ 25 నుండి 29 వరకు జరిగిన ఈ పోటీలలో కర్నూలు జిల్లా క్రీడాకారులు మూడు బంగారు, రెండు కాంస్య పథకాలు సాధించారు. ఇందులో వెంకటేశ్వర రావు, జి.సుందర రాజు, శ్రీనివాసులు టీం పూమ్ సే విభాగంలో బంగారు పతకాలు, ఇ. హుస్సేన్, ప్రేమ జ్యోతి పెయిర్ పూమ్‌సే విభాగం లో బంగారు పతకాలు, ఎస్. రషీఫా, ఎస్. రిహాన్‌లు, సబ్ జూనియర్ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. వారిని కోడుమూరు ఎమ్మెల్యే బి. దస్తగిరి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తైక్వాండో అనేది ఒలింపిక్ స్థాయి క్రీడ అని దీనికి అనుగుణంగా మన ముఖ్యమంత్రి మూడు శాతం క్రీడా కోటాను అందిస్తున్నారన్నారు. తైక్వాండో క్రీడను బాల్య స్థాయి నుండి సాధన చేస్తూ విద్యార్థి దశలో సీనియర్ విభాగంలో వివిధ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని కాక్షించారు. సురేష్, బాలాజీ విలాస్ సెక్రటరీ తైక్వాండో అసోసియేషన్ అఫ్ కర్నూలు ప్రెసిడెంట్ చేతన్ కుమార్, కోచ్ లు సుజన్, మహబూబ్ పాషా, ఉదయ్, వినీత్, వాణి పాల్గొన్నారు.

వీరజనావ్ మురళీ నాయక్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న తిక్కారెడ్డి, తదితరులు

వీరజవాన్‌కు టిడిపి నేతల నివాళి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : దేశ సరిహద్దులో పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన మురళి నాయక్ చిత్రపటానికి జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి , రాష్ట్ర, పార్టీ కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మురళీనాయక్ చిత్రపటానికి టిడిపి కార్యాలయంలో శనివారం పూల మాల వేసి నివాళి అర్పించారు. ఉగ్రవాదులను అణచివేసే ఈ యుద్ధానికి యావత్ భారతావని అండగా ఉంటుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వానికి పూర్తి మద్దతు తెలిపారన్నారు. ఉగ్రవాదంపై ఎటువంటి చర్యలు చేపట్టినా ప్రతి పౌరుడు మద్దతు తెలపాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

వివక్షతపై ఐక్య పోరాటం

- కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

వివక్షతకు, అంటరానితనానికి, అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు కోరారు. శనివారం గోనెగండ్లలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అలాగే కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు అధ్యక్షతన మరో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశం సాంకేతికంగా అభివృద్ధి చెందుతోందనే ఆనందం కొద్దిమంది వరకే పరిమితం అవుతోందని తెలిపారు. దానికి కారణం నేటికి గ్రామ సీమల్లో వివక్షత, అంటరానితనం విలయతాండవం చేస్తుండడమేనని చెప్పారు. క్రిష్ణగిరి మండలం ఎస్‌హెచ్.ఎర్రగుడిలో 1960లోనే వేరు చేసి నిర్మించిన దళితుల బావి, ఊరి మధ్యలో ఉండి విలువైంది కావడంతో, అది దళితులకు దక్కకూడదని టిడిపి జెండా పాతి మరీ వివక్ష చూపుతున్నారని తెలిపారు. నేటికీ గ్రామంలో దేవాలయాల ప్రవేశం, రచ్చబండలపై కూర్చోవడం, పీర్ల చావిడి ఎక్కడం కానీ చేయడం లేదన్నారు. కోసిగి మండలం సాతనూరు, దిద్ది గ్రామాల్లో దళిత రైతులకు రస్తా ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని తెలిపారు. కౌతాళ మండలం చూడి గ్రామంలో వివక్ష కొనసాగుతోందన్నారు. జిల్లా, మండల అధికారులు వెంటనే జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించకపోతే ప్రతిఘటన పోరాటం చేయడానికి సిద్ధం కావాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు భాస్కర్, పెద్దబాబు, మారయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఏసు రాజు, తిమ్మన్న, ఆంథోని, మదన గోపాల్, వీరేష్, హనుమంతు, నాగన్న, రామకృష్ణ, నాగరాజు, ఏసేపు పాల్గొన్నారు.

రథోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్ఐ హనుమంతురెడ్డి

రథోత్సవ ఆవరణను పరిశీలిస్తున్న ఎస్ఐ, నాయకులు

ప్రజాశక్తి - కోసిగి

కోసిగిలో సోమవారం జరిగే కోసిగయ్య రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ హనుమంతు రెడ్డి తెలిపారు. శనివారం ఆలయ అధికారులు, నాయకులతో కలిసి రథశాల ముందు ఉండే ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రథోత్సవం సందర్భంగా జనాలు ఎక్కువగా వస్తారని, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అక్కడ ఉండే షాపు యజమానులు తమ షాపుల ముందు వేసుకున్న రేకులను తాత్కాలికంగా తొలగించాలన్నారు. అలాగే రథశాల ముందు, చుట్టుపక్కల ఉన్న ఇళ్లవారు, షాపుల యజమానులు చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రథోత్సవంలో ఎవరైనా సరే అల్లర్లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాయకులు మాణిక్ రాజ్, టిడిపి నాయకులు ముత్తురెడ్డి, తాయన్న, అయ్యన్న, తోవి రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం

ప్రజాశక్తి - కౌతాళం

ఫకీర్ సాబ్‌లకు స్వాగతం పలుకుతున్న పీఠాధిపతులు

శ్రీ జగద్గురు ఖాదర్ లింగ స్వామి ఉత్సవాల సందర్భంగా గంధోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శనివారం స్వామివారి ఫకీర్ సాబ్‌లకు దర్గా పీఠాధిపతులు స్వాగతం పలికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. వీరు రావడం వల్ల దర్గాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అర్ధరాత్రి నుంచి దర్గా ధర్మకర్త మున్నా పాషా ఇంటి నుంచి దర్గా వంశస్తులు గంధాన్ని మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో దర్గాలో ప్రవేశించారు. తెల్లవారు జామున ప్రత్యేక ఫాతేహాలు భక్తులు నిర్వహించారు. దర్గాలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రోడ్డుపైనే మురుగు..!

- రోడ్లు, డ్రెయినేజీ లేక ప్రజల అవస్థలు
- రహదారిపై డ్రెయినేజీ పైపు పగిలి వాహనదారుల ఇబ్బందులు
- సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీ లేక మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారిపై డ్రెయినేజీ పైపు పగిలి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ప్రధాన రహదారిపై పైపు పగిలి నిలిచిన నీరు

గ్రామంలోని 2వ వార్డులో ఇళ్ల ముందు రోడ్డు సరిగా లేక, డ్రెయినేజీ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం బస్టాండ్ దగ్గర మాచాపురానికి వెళ్లే రోడ్డు మార్గాన్ని నిర్మించింది. ఆ నిర్మాణం పూర్తయిన తర్వాత దానికి ఆనుకుని ఉన్న వీధిలో గల రోడ్డు మార్గానికి సమస్యలు ప్రారంభమయ్యాయి. మాచాపురం రోడ్డుకు సమాంతరంగా దానికి ఆనుకుని ఉన్న రహదారిని నిర్మించకుండా వదిలేశారు. మాచపురానికి వెళ్లే రహదారి ఎత్తు కావడం వల్ల అక్కడ నీరు తగ్గు ప్రాంతంలో ఉన్న 2వ వార్డులో గల ఇళ్ల ముందుకు చేరి నిల్వ ఉంటోంది. డ్రెయినేజీ ద్వారా పై వీధిలో నుంచి వచ్చే మురుగునీరు ఇళ్ల ముందుకు వస్తోంది. మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దుర్వాసన, దోమల బెడదతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని ప్రజల ఆవేదన చెందుతున్నారు. బస్టాండ్ సమీపంలో నాగలదిన్నె వెళ్లే రోడ్డుపై డ్రెయినేజీ పైపు పగిలి రోడ్డు దుర్భరంగా తయారైంది. గత కొన్ని నెలలుగా వాహనదారులు, ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నా ఆర్‌అండ్‌బి అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

వాహనదారుల ఇబ్బందులు

ప్రధాన రహదారిపై పైపు పగిలిపోవడం వల్ల రోడ్డు దుర్భరంగా తయారైంది. డ్రెయినేజీలో వచ్చే మురుగునీరు నిల్వ ఉంటోంది. వాహనాలు మురుగునీటిలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వాహనాలు, బస్సులు, లారీలు తిరగడానికి ఇబ్బందికరంగా తయారయింది. వాటి టైర్లు డ్రెయినేజీలో ఇరుక్కుపోవడం జరుగుతోంది. రైతులు ఎద్దుల బండ్లతో పొలాలకు వెళ్లే సమయంలో ఇబ్బంది పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు రాత్రి వేళల్లో అవసరాల నిమిత్తం కూడా బయటకు రాలేని విధంగా ఉంది. అధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

అధికారులకు విన్నవించినా స్పందన కరువు

- విశ్వనాథ్ గౌడ్, గ్రామస్తుడు

వీధిలో డ్రెయినేజీ, రోడ్డు సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇంటి ముందు నిలిచి ఉన్న మురుగునీటి వల్ల అనారోగ్యాల పాలవుతున్నాం. సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా స్పందించడం లేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి, మా ఆరోగ్యాలను సంరక్షించాలి.

త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం

- ఎఇ నరసింహులు

ప్రజలు సమస్యను మా దృష్టికి తెచ్చారు. ఆ ప్రదేశాన్ని మేము సందర్శించి పరిశీలించాం. త్వరలోనే రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.

జవాన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్‌కు వైసిపి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం ఎమ్మిగనూరులోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో బుట్టా శివనీలకంఠ, నాయకులతో కలిసి నివాళులర్పించారు. సరిహద్దులో విధి నిర్వహణలో ధైర్యంగా పోరాడి వీర మరణం పొందిన తెలుగు బిడ్డ, భారత సైనికుడు ఎం.మురళీ నాయక్ త్యాగానికి వైసిపి తరఫున ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివ నీలకంఠ మాట్లాడారు. మురళీ నాయక్ త్యాగం దేశానికి గర్వకారణమని, ఆయన ధైర్య సాహసం ఈ తరం యువతకు ఆదర్శమని తెలిపారు. దేశాన్ని రక్షించడంలో ప్రాణాలర్పించిన వీరుడని, ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉండాలని కోరారు. శాసనసభలో కూడా ఈ త్యాగాన్ని ప్రస్తావించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్, కెఆర్.లక్ష్మీకాంత్ రెడ్డి, విరుపాక్షి రెడ్డి, శివారెడ్డి గౌడ్, కెఆర్.రామకోటేశ్వర్ రెడ్డి, శివ ప్రసాద్, కదిరికోట సునీల్ కుమార్, పాల శ్రీనివాస్ రెడ్డి, వెంకటాపురం బజారి, డిష్ కేశవరెడ్డి, కోటకొండ నరసింహులు, గడ్డం అంజి, గురువయ్య, మాబాష, అల్తాఫ్, రాజా శరత్, సుధాకర్, సోమేష్, లతా రెడ్డి, నాగేంద్ర, వాల్మీకి జయమ్మ, బజారి, వెంకటాపురం రాజు, మహబూబ్ బేగ్, పామయ్య, ప్రభాకర్, సయ్యద్ చాంద్, చంద్రశేఖర్, గౌస్, యూసుఫ్, మణి, మాచాని రఘు పాల్గొన్నారు.

వీర జవాన్ మురళీ నాయక్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే బీవీ ఆధ్వర్యంలో గ్రామ కమిటీలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు తాలూకా పరిధిలోని గోనెగండ్ల మండలం లింగందిన్నె, కున్నూరు గ్రామాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి సంస్థాగత కమిటీల నియామక ప్రక్రియ కొనసాగింది. గోనెగండ్ల మండలం లింగందిన్నె, కున్నూరు గ్రామ కమిటీల అధ్యక్షులు, సభ్యులను ఎమ్మెల్యే నియమించారు.

ఎమ్మెల్యే బీవీతో ఉన్న కొత్తగా ఎన్నికైన నాయకులు

20న సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఆదోని

పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కుల సాధనకు కార్మికులు సమిష్టిగా పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. శనివారం ఆదోని రెవెన్యూ భవన్‌లో అఖిలపక్ష సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. హక్కుల సాధన కోసం జరిగిన పోరాటంలో ఎందరో కార్మికులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అలా సాధించుకున్న హక్కులను, చట్టాలను ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగాల్లో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిన చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని దశాబ్ద కాలంగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎఐటియుసి నాయకులు అజయ్ బాబు మాట్లాడుతూ... కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పేరుతో ప్రభుత్వ రంగాల్లో కనీస వేతనం ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని విమర్శించారు. మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు మాట్లాడుతూ... రైతు సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటాలు చేసినా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్పొరేట్ శక్తుల ఒత్తిళ్లకు ప్రభుత్వాలు తలొగ్గి రైతులను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదన్నారు. ఈనెల 20న జరిగే సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని కాంగ్రెస్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేవి శెట్టి ప్రకాష్ తెలిపారు. సిఐటియు నాయకులు గోపాల్, వీరారెడ్డి, నాయకులు దేవా, లక్ష్మన్న, లింగన్న, ఈరన్న, లక్ష్మి రెడ్డి, తిప్పన, రామాంజినేయులు, కల్లుబావి రాజు ఉన్నారు. **ఎమ్మిగనూరు**లోని సుందరయ్య భవన్‌లో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు గోవిందు అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు మాట్లాడారు. కార్మిక వ్యతిరేక లేబర్ చట్టాల రద్దు కోసం ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఎఐటియుసి తాలూకా సెక్రటరీ తిమ్మగురుడు, ఐఎఫ్‌టియు తాలూకా నాయకులు పి.ప్రసాద్, రైతు కూలీ సంఘం నాయకులు ఎస్.రాజు, ఐఎఫ్‌టియు తాలూకా నాయకులు ఎస్.బాలరాజు, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, ఐఎఫ్‌టియు తాలూకా నాయకులు కె.హనీఫ్, రైతుసంఘం నాయకులు లక్ష్మీ నరసయ్య, నాయకులు డి.ఉస్మాన్ బాష, నరసింహారెడ్డి, బాబు, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న అంజిబాబు

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న రామాంజనేయులు

నాగాలాండ్‌కు బయల్దేరిన వీర సైనికుడు సుధర్మ

ప్రజాశక్తి - మంత్రాలయం

దేశ సరిహద్దుల్లో నెల కొన్న ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో మంత్రాలయానికి చెందిన వీర సైనికుడు సుధర్మ నాగాలాండ్‌కు బయల్దేరి వెళ్లారు. ఈనెల 7న మంత్రాలయం వచ్చిన సుధర్మకు వెంటనే తిరిగి విధుల్లోకి చేరాలని ఉన్నతాధికారుల నుంచి ఫోన్ రావడంతో హుటాహుటిన శనివారం ఉదయం బయల్దేరి వెళ్లారు. దేశం కోసం, దేశ ప్రజల రక్షణ కోసం దేశ సరిహద్దుల్లో భద్రత కల్పిస్తున్న సైనికులు ప్రాణ త్యాగానికి సైతం వెనుకాడకుండా వీరోచిత పోరాటాలు చేసి రక్షణ కల్పిస్తున్న సేవలు ప్రశంస నీయం.

ఎఇ పర్యవేక్షణ లోపంతో రూ.25 లక్షలు నష్టం

- సిపిఎం నాయకులు జయరాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎఇ నాగమల్లయ్య నిర్లక్ష్యం వల్లే ఓవర్ హెడ్ ట్యాంక్ కూలి రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని సిపిఎం నాయకులు హెచ్.జయరాజు విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2017లో నాబార్డు ద్వారా రూ.9 కోట్ల నిధులతో నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుతో పాటు మరో మూడు ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాన్ని హైదరాబాద్‌కు చెందిన జిపిఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు చేపట్టారని తెలిపారు. అందుబాటులో ఉన్న అప్పటి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగమల్లయ్య నాణ్యత ప్రమాణాలను చూడకుండా, నిర్లక్ష్యమే వాటర్ ట్యాంక్ కూలి పోవడానికి కారణమని చెప్పారు. ఆయనను విధుల నుంచి తొలగించి నష్టపోయిన రూ.25 లక్షలను ఆయన ద్వారా ప్రభుత్వానికి తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కూలిన చోటే సత్వరమే మరో ట్యాంకు నిర్మాణం చేపట్టి నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ట్రాఫిక్ సిఐ సుబ్బారావు

అవగాహన కల్పిస్తున్న సిఐ

ప్రజాశక్తి - ఆదోని

చిన్న పొరపాటు వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదోని ట్రాఫిక్ సిఐ గంట సుబ్బారావు తెలిపారు. శనివారం ఆదోనిలోని శ్రీనివాస్ భవన్ వద్ద ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని ప్రభాకర్ టాకీస్, రైతు బజార్, మార్కెట్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనం నడిపేటప్పుడు కలిగి ఉండాల్సి పత్రాల గురించి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రజిత

మద్యపానం ఆరోగ్యానికి హానికరం

- డాక్టర్ రజిత

ప్రజాశక్తి - కోసిగి

మద్యపానం ఆరోగ్యానికి హానికరమని, మద్యం సేవించడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతారని డాక్టర్ రజిత తెలిపారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎక్సైజ్ సిఐ భార్గవ్ రెడ్డి అధ్యక్షతన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్ (కేర్) అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మద్యపానం సేవించడం వల్ల శారీరక, మానసిక ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. మద్యానికి దూరంగా ఉండాలన్నారు. తాగి వాహనాలు నడపకుండా, ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండి బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుల్ మునిరంగడు, భరత్ పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నమెంట్‌కు ఆదోని క్రీడాకారుడు

ప్రజాశక్తి - ఆదోని

కబడ్డీ స్టేట్ టోర్నమెంట్‌కు ఆదోని ఫిలిప్ కబడ్డీ జట్టు క్రీడాకారుడు కల్యాణ్ ఎంపికయ్యారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు, జట్టు కోచ్ అమర్ ప్రకాష్ తెలిపారు. శనివారం పలువురు కల్యాణ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా అమర్ ప్రకాష్ మాట్లాడారు. ఆంధ్ర కబడ్డీ మెన్స్ ఇన్విటేషన్ స్టేట్ మీట్ టోర్నమెంట్‌లో ఆడే కర్నూలు జట్టులో సభ్యుడుగా కల్యాణ్ ఉంటారన్నారు. ఆదోనిలోని అరుణ్ జ్యోతి నగర్‌కు చెందిన కల్యాణ్ ఫిలిప్ కబడ్డీ జట్టు సభ్యుడిగా ఉన్నారని తెలిపారు. ఇటీవల కర్నూలు జట్టు ఎంపికకు జరిగిన పోటీల్లో కల్యాణ్ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 10, 11, 12న మొత్తం 13 జిల్లా జట్లు పాల్గొనే టోర్నమెంట్‌లో కల్యాణ్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జిల్లా జట్టులో ఎంపికకు సహకరించిన కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ శుభకర్‌కు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేను విమర్శించే అర్హత వీరభద్ర గౌడ్‌కు లేదు : వైసిపి

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షిని విమర్శించే అర్హత టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌కు లేదని వైసిపి నాయకులు, మాజీ ఎంపిటిసి భాస్కర్ నాయుడు తెలిపారు. శనివారం వైసిపి ఆలూరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే విరుపాక్షి ఎమ్మెల్యే కాకముందు నుంచే తన స్వంత ఖర్చులతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే అయ్యాక ప్రభుత్వం తమది లేకపోయినా, అసెంబ్లీకి వెళ్లకున్నా జిల్లా పరిషత్ సమావేశాల్లో, కలెక్టర్, డిఎల్‌పిఒ, ఇతర ఉన్నతాధికారులను కలిసి ఆలూరు అభివృద్ధికి నిధులు వచ్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్‌కు ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు ఎలాగో అవకాశం ఇవ్వరని తెలుసుకొని వచ్చిన పనుల్లో కమీషన్లు దండుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రెండు పర్యాయాలు ఓడిపోయిన వీరభద్ర గౌడ్‌కు ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదన్నారు. అలాగే తాగునీటి సమస్యలపై జిల్లా స్థాయి సమావేశాల్లో సంబంధిత అధికారులను ప్రశ్నించిన సంగతి టిడిపి నాయకులు మరిచారని తెలిపారు. ఉపాధి ద్వారా చేపడుతున్న సిసి రోడ్డు పనులు కూడా ఎమ్మెల్యే చొరవతో జరుగుతున్నవేనని, ఎంపిపి నిధులతో మరెన్నో అభివృద్ధి పనులను ఆలూరు మండలంలో చేశారని గుర్తు చేశారు. వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, కోకన్వీనర్ వీరేష్, మాజీ ఎంపిటిసి నాగేంద్ర, బాబు, వరుణ్, తిక్కస్వామి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు భాస్కర్ నాయుడు

ఘనంగా నరసింహ స్వామి జయంతి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో నరసింహ స్వామి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. శనివారం శ్రీనరసింహ స్వామి జయంతి సందర్భంగా శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు శ్రీమఠంలోని పూజా మందిరంలో రాఘవేంద్ర స్వామి ఆరాధ్య దైవమైన మూల రాములతో పాటు శ్రీవిభుధేంద్ర తీర్థులకు స్వప్నంలో లభించిన 12 చేతులు కలిగిన (షోడశబాహు) శ్రీనరసింహ స్వామి విగ్రహాలకు మహాభిషేకం నిర్వహించారు. పండితుల వేద మంత్రాల మధ్య పుష్పార్చన, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనరసింహ జయంతి సందర్భంగా మంత్రాలయంలోని శ్రీమఠంలోని శ్రీవిభుధేంద్ర తీర్థ స్వప్నలబ్ధ శ్రీషోడశబాహు నరసింహ దేవేరులకు హెచ్‌హెచ్ శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామీజీ మహా అభిషేకం నిర్వహించారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు శ్రీమఠానికి చెందిన భక్తులు, శిష్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

పూజలు చేస్తున్న పీఠాధిపతులు

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ కవచాలు లేని వైనం

ప్రజాశక్తి- దేవనకొండ

విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారాయి. దేవనకొండలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వెనుక, తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు, జిల్లేడు బుడకలలోని ఎస్సీ కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, తెర్నేకల్ గ్రామంలో బస్టాండ్ సమీపంలో, మెయిన్ రోడ్డులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లుకు ప్రహరీ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో కూడా ఆయా గ్రామాల్లో ప్రమాదాలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి. మూగజీవాలు ప్రమాదానికి గురయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

'డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలి'

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవన నిర్మాణం చేపట్టాలని పిడిఎస్‌ఒ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, డిఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉదయ్ కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో పిడిఎస్‌ఒ, డిఎస్‌ఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అద్దె భవనంలో అరకర సౌకర్యాలతో విద్యా బోధన కొనసాగుతోందని తెలిపారు. కళాశాలకు స్థలం కేటాయించామని ప్రభుత్వం చెబుతున్నా ఇంతవరకు స్థలాన్ని చూపించలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉన్నత విద్య చదువుకోవడానికి వస్తున్న విద్యార్థులు డిగ్రీ కళాశాల భవనం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరానికైనా కళాశాల భవన నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు శివ, అనుమేష్, రాజేష్, రఘు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

వంద పడకలకు పెంచాలి

- పిహెచ్‌సిని పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కర్ణాటక సరిహద్దులో పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్పత్రిని వంద పడకలకు పెంచాలని సిపిఎం నాయకులు కోరారు. గతంలో డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. శనివారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిపిఎం ఆధ్వర్యంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి అయ్యన్న, సిపిఎం సీనియర్ నాయకులు రామలింగప్ప, పార్టీ సభ్యులు లక్ష్మన్న, గర్జప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆస్పత్రిని 30 పడకల నుంచి 6 పడకలకు కుదిరించారని, ఇద్దరు డ్యూటీ డాక్టర్లకు గాను కేవలం ఒక్కరే ఉన్నారని తెలిపారు. షుగర్ ఇన్సులిన్ ఇంజక్షన్ 15 రోజులు క్రితమే స్టాక్ అయిపోయినప్పటికీ నేటి వరకు తెప్పించలేదని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విచ్ఛినం చేసి పేదలకు వైద్యాన్ని ప్రభుత్వాలు దూరం చేస్తున్నాయని విమర్శించారు. తగిన సిబ్బందిని నియమించి, ఆస్పత్రిలో అన్ని రకాల మందులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఘనంగా పివి.రావు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని సంజీవ నగర్‌లో ఉన్న మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల నరసన్న స్వగృహంలో పివి.రావు (పోతుల విగ్నేశ్వర రావు) 76వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల నరసన్న మాట్లాడారు. మాల మహానాడు వ్యవస్థాపకుడు పివి.రావు అని, అంబేద్కర్ భావజాలంతో ఆయన సిద్ధాంతంతో ముందుకు నడిచిన మహనీయుడు పివి.రావు అని చెప్పారు. కొంతమంది కులాన్ని అడ్డం పెట్టుకుని నాయకులుగా వచ్చి రాజకీయ పార్టీలకు అమ్ముడుపోయారని, అలా కాకుండా కులానికి, కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. మాల మహానాడు తాలూకా అధ్యక్షులు రవిచంద్ర, పట్టణ అధ్యక్షులు ఎద్దుల చెన్నయ్య, ఐశ్వర్య, మహేశ్వరి, వీరేష్ పాల్గొన్నారు. **ఆస్పరి**లో పివి.రావు జయంతి వేడుకలను మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పివి.రావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాల మహానాడు నాయకులు భరత్, వీరేష్, నీలప్ప, సావిత్రమ్మ, మునెమ్మ, అన్నపూర్ణ, నాగలక్ష్మి, సుజాతమ్మ, అంజిబాబు, హరి పాల్గొన్నారు.

ఎస్ఐకి పెద్దహరిహాణం గ్రామస్తుల సన్మానం

ఎస్ఐని సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్‌ను పెద్దహరివాణం గ్రామస్తులు సన్మానించారు. ఈనెల 3, 4న శ్రీగర్జిలింగేశ్వర స్వామి పంచమ బండార మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా డీఎస్పీ హేమలత ఆదేశాల మేరకు తాలూకా సిఐ నల్లప్ప పర్యవేక్షణలో ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలును విజయవంతం చేసిన ఎస్ఐకి పెద్దహరివాణం గ్రామస్తులు శనివారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు మెడికల్ నాగరాజ్, బీపీ.బసవరాజు, బీపీ.వీరేష్, కుప్పలదొడ్డి గర్జప్ప, నల్లారెడ్డి నాగప్ప మాట్లాడారు. గ్రామంలో వైభవంగా శ్రీగర్జి లింగేశ్వర స్వామి పంచమ బండారం మహోత్సవాలకు చుట్టుపక్కల గ్రామస్తులతో పాటు కర్ణాటక నుంచి భారీ ఎత్తున తరలివచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి పోలీసుల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. పెద్దహరివాణం గ్రామస్తులు భాస్కర్, లింగన్న, జంబునాథ, నాగరాజ్ పాల్గొన్నారు.

గాలి, వెలుతురు కరువు

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు గాలి, వెలుతురు వచ్చేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని రోగులు, బంధువులు కోరుతున్నారు. అప్పుడెప్పుడో నాలుగేళ్ల క్రితం కరోనా రోగులను చెక్ చేయడానికి ఆదోని ఏరియా ఆస్పత్రిలో పెట్టిన కరోనా బాక్స్ అవసరం లేకున్నా ఇంతవరకూ తొలగించకపోవడం వల్ల వార్డులో రోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆస్పత్రిలో గాలి రాకుండా ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజలు, డాక్టర్లు, నర్సులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే ఈ డబ్బాను తొలగించి ఆస్పత్రిలో స్వచ్ఛమైన గాలి వీచే విధంగా మార్పులు చేయాలని రోగులు కోరుతున్నారు. ఇబ్బందులు తెలుసుకొని సమస్యను పరిష్కరించాలని పేర్కొంటున్నారు.

మెడికవర్‌లో 'మాక్ లూపస్ విసిబ్లె' పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మెడికవర్ హాస్పిటల్ లో అవగాహన పెంచడానికి ప్రతి మే నెల 10న ప్రపంచ లూపస్ దినోత్సవంగా జరుపుకుంటామని కర్నూలు మెడికవర్ కన్సల్టెంట్ ,మటాలజిస్ట్ డాక్టర్ సృజన.ఎ తెలిపారు. శనివారం ఆస్పత్రి ఆవరణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆమె మాటల్లో... మాట్లాడుతూ దానిని ఎస్ఎల్ఇ అని కూడా అంటారు. ఎస్ఎల్ఇ అనేది రోగ నిరోధక శక్తి మీద ప్రభావం చూపే ఒక దీర్ఘకాలిక వ్యాధి ఇందులో రోగ నిరోధక శక్తి (ఇమ్యూన్ సిస్టం) సహజంగా బయట నుండి వచ్చే బాక్టీరియా, వైరస్‌ను, కావర్ల్ కణాలనుండి కాపాడుతుంది. కానీ ఈ ఆటో ఇమ్యూన్ డిసీస్‌లో ఇమ్యూన్ సిస్టం అనేది మన శరీర కణాలపై దాడి చేస్తుంది. దానివల్ల శరీరంలో మొదలు అవుతుంది. దీని ఫలితంగా శరీరంలో ఒక్కో కణజాలం మీద ప్రభావం చూపి నొప్పిని, వాపును కలుగచేసి డాన్ ట్రావత్ డామేజ్ చేస్తుంది.

మాక్ లూపస్ విసిబ్లె - మే నెల యొక్క థీమ్ ప్రాముఖ్యత:

లక్షలాది మందిని ప్రభావితం చేసే ఎస్-ఎల్ఇ గురించి అవగాహన పెంచడం, వ్యాధిని అర్థం చేసుకోవడం, అపోహలు తొలగింపు, జీవన నాణ్యతను మెరుగుపడచడం చేయాలి. ఈ వ్యాధిని తొందరగా

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మటాలజిస్ట్ డాక్టర్ సృజన.ఎ

గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా ఈ వ్యాధిని నుంచి కోలుకోవచ్చు. సరైన చికిత్స తో ఈ వ్యాధి నుంచి దూరం ఉండచ్చు. ఇది ముఖ్యంగా ప్రసవ వయస్సులో ఉన్న మహిళలను ప్రభావితం చేస్తుంది. కానీ పురుషులు, పిల్లలు, అన్ని వయస్సులవారు దీనికి గురవుతారు. ఈ వరల్డ్ లూపస్ డే నాడు మనం ఎస్-ఎల్ఇ పట్ల ఉన్న అపోహలను తొలగించాలి. వ్యాధిపై అవగాహన పెంచాలి. లూపస్ తో జీవించే రోగులకు మద్దతు ఇవ్వాలి.అనంతరం మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ డాక్టర్ వై. మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి జబ్బు ఉన్నవారు దీర్ఘ కాలిక సమస్యగా బాధపడుతూ ఉండాల్సిన అవసరం లేదు. సరైన చికిత్స తీసుకుని సమస్య నుంచి దూరంగా ఉండొచ్చన్నారు. మాదగ్గర ఉన్న రుమటాలజిస్ట్ కలిసి ఆరోగ్యవంతులుగా అవ్వాలని అన్నారు.

అనుభవజ్ఞులైన వైద్యులచే మెడికవర్ హాస్పిటల్స్ 24/7 అందుబాటులో ఉందని, చికిత్స అందిస్తూ, సరైన సమయంలో సరైన వైద్యం, అత్యాధునిక సదుపాయాలతో మెడికవర్ హాస్పిటల్స్ లో వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ఆర్ఐఒ గురువయ్య శెట్టి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 12 నుంచి నిర్వహించే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆర్ఐఒ ఎస్‌విఎస్.గురువయ్య శెట్టి పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. శనివారం కర్నూలులోని ఆర్ఐఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను మొదటి సంవత్సరంలో 16,292 మంది, ద్వితీయ సంవత్సరంలో 5,032 మంది విద్యార్థులు రాస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రవాణా సౌకర్యంలో ఇబ్బందులు లేకుండా ఆర్‌టిసి బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచామని చెప్పారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులకు పరీక్ష రాసేందుకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందన్నారు. పరీక్ష పర్యవేక్షణకు రెండు ఫ్లయింగ్ స్క్వార్డ్, ఆరు సిట్టింగ్ స్క్వార్డ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. డిఇసి సభ్యులు లాలప్ప, పద్మావతి, సురేష్ చంద్ర పాల్గొన్నారు

కూడా చైర్మన్ కు సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కల్లూరు మండలం, గోవర్ధన నగర్ పంచముఖి ఆంజనేయస్వామి ధర్మకర్త చిలుకూరి వీర ప్రతాప్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వీరికి ఆలయం తరపున మేల తాళాలతో పూర్ణకుంభంతో బ్రాహ్మణులు, ఆలయ కమిటీ వారు ఆహ్వానం పలికారు. తదనంతరం ఆలయాన్ని దర్శించి పూజలు నిర్వహించారు. బ్రాహ్మణుల చేత ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆలయ ధర్మకర్త చిలుకూరి ప్రతాప్ సోమిశెట్టి వెంకటేశ్వర్లని ఘనంగా సత్కరించారు. ప్రతి శనివారం కార్యక్రమంలో భాగంగా శ్రీ రామాయణం ప్రవచన వక్త డాక్టర్ గుంటూరు సుబ్బరామయ్యని, సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఘనంగా సత్కరించారు.

జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు తగదు

యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల కక్ష సాధింపు చర్యలు తగదని యునైటెడ్ జర్నలిస్టు ఫోరం (యుజెఎఫ్)వ్యవస్థాపక అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నీలం సత్యనారాయణ, చిన్న రామాంజనేయులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, చంద్రమోహన్, జిల్లా గౌరవాధ్యక్షులు యూసుఫ్ ఖాన్, జిల్లా కోశాధికారి సంధ్య ప్రసాద్, జిల్లా నాయకులు విజయ్, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.విజయ్ కుమార్ కర్నూలు సిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేంద్రుడు, మునిస్వామి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు విజయ్, మధులు శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో పోలీసులు దౌర్జన్యంగా చొరబడి సోదాలు నిర్వహించడం సరైందికాదన్నారు. ఇటీవల కాలంలో సాక్షి మీడియాపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న చర్యలు పత్రికా స్వేచ్ఛను హరింప చేసే విధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇలాంటి కక్ష సాధింపు చర్యలను విరమించుకోకపోతే రాబోయే కాలంలో పెద్దఎత్తున జర్నలిస్టులను ఏకం ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

వీర జవాన్ మురళి నాయక్ కు నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వీర జవాన్ మురళి నాయక్‌కు శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు నివాళులర్పించారు. యుద్ధంలో అమరుడైన వీర జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు కర్నూల్ సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జిలాని బాష మాట్లాడుతూ దేశం కోసం యుద్ధ భూమిలో వీరమరణం పొందిన మురళి నాయక్ కు కాంగ్రెస్ పార్టీ తరపున ఘన నివాళులర్పిస్తుందన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన మురళి నాయక్ కుటుంబానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ని బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, జిల్లా మహిళా కాంగ్రెస్ ఎ. వెంకట సుజాత, కాంగ్రెస్ నాయకులు ఎండ్లూరి లాజరస్, షేక్ రియాజుద్దీన్, సయ్యద్ ఖాద్రీ పాష, అబ్దుల్ హై, ఐఎన్‌టియుసి ఆర్ ప్రతాప్ ,అభి నాయుడు పాల్గొన్నారు.

ఉగ్రవాదులపై భారత్ ప్రతీకారం

ప్రజాశక్తి - కర్నూల్ కల్చరల్

పహల్గాంలో అమాయక ప్రజలపై దాడి చేసిన ఉగ్రవాదులపై ప్రధానమంత్రి మోడీ ప్రతికారం తీర్చుకున్నారని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక టీజీవి కళాక్షేత్రంలో జై జవాన్ కల్చరల్ ఫెస్టివల్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతమాత చిత్రపటానికి ఆయన క్షీరాభిషేకం చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కళాక్షేత్రం అధ్యక్షులు ప్రతి ఓబులయ్య స్వాగతం పలుకుతూ వారం రోజులపాటు దేశభక్తి గీతాలు నృత్యాలు ప్రదర్శిస్తూ సైనికులకు అంకితం చేస్తామన్నారు. అనంతరం టీజీ మాట్లాడుతూ సైనికుల త్యాగాలను వెలకట్టలేమన్నారు. వాళ్లు దేశం కోసం ప్రాణాలర్పిస్తున్నారని తెలిపారు. సైనికుల్లో మాజీ సైనికులు అంటూ లేరని ఒకసారి సైనికుడిగా పని చేసిన తర్వాత వారు జీవితాంతం దేశభక్తులు గాని జీవిస్తారన్నారు. 16వ తేదీ వరకు సైనిక సేవలను కీర్తిస్తూ కళాక్షేత్రంలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం ఎస్ మహమ్మద్ మియా నేతృత్వంలో దేశభక్తి గీతాలు జానపద గేయాలు ఆలపించారు. ఇందులో కరీముల్లా బృందం పాల్గొంది కార్యక్రమంలో యాగంటి ఈశ్వరప్ప శ్రీనివాసరెడ్డి బాల వెంకటేశ్వర్లు సివిరెడ్డి వివి రమణారెడ్డి పీ రాజారత్నం రాముడు సంఘ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం : డిఐజి, ఇంచార్జి ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లాలో రహదారి ప్రమాదాల నియంత్రణ లక్ష్యమని, ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ కుమార్, కర్నూలు జిల్లా ఇన్చార్జి ఎస్‌పి అది రాజ్ సింగ్ రాణా పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వాహన దారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సంధర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ల పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనలపై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైకులు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

తనిఖీ చేస్తున్న అధికారులు